జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్

Epaper.Edisangathi.com

సంపుటి: 4 - సంచిక: 335 | 28 జులై 2026 | మంగళవారం | 4 పేజీలు

## రైల్వే ప్రాజెక్టులకు వేగం పెంచండి



**- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ అర్వింద్ ధర్మపురి**

(నిజామాబాద్, ఇదీ సంగతి)

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులకు పరిపాలనా, ఆర్థిక అనుమతులు త్వరితగతిన మంజూరు చేసి, ఇప్పటికే ఆమోదం పొందిన పనులను వేగవంతం చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన.. పార్లమెంట్ నియోజకవర్గంలో ని పలు రైల్వే ప్రాజెక్టులపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీపేట రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ) మంజూరు చేయడంతో పాటు, డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు నివారించి ప్రయాణికుల భద్రత మరింత మెరుగుపడుతుందని ఎంపీ వివరించారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు. సంబంధిత అధికారులతో ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల ఇందల్వాయి, జానకంపేట వద్ద నూతన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రికి ఎంపీ అర్వింద్ ధర్మపురి కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎంపీ పేర్కొన్నారు.




## ఫిర్యాదు అందితే.. వెంటనే స్పందించాలి

**- టౌన్-3 పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెరిగేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిక్కచ్చిగా విధులు నిర్వర్తించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. మంగళవారం టౌన్-3 పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, వివిధ కేసుల ఫైళ్లను పరిశీలించిన కమిషనర్.. దర్యాప్తులో ఉన్న కేసులను ప్రత్యేక కార్యాచరణతో వేగంగా పూర్తి చేయాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. నగరంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలనీల్లో ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులపై నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, అనుమానాస్పద కదలికలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ అమలు చర్యలు కట్టుదిట్టం చేసి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్ యాప్‌ల మోజుతో యువత సైబర్ మోసాలకు గురవుతున్న నేపథ్యంలో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. డ్రగ్స్ నియంత్రణకు యువతలో నిరంతర అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ప్రతి కేసు దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, అధికారులు, సిబ్బంది 24 గంటలూ హెడ్‌క్వార్టర్స్ పరిధిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు విధుల్లోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. తనిఖీల్లో ఏసీపీ ప్రకాష్ యాదవ్, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, టౌన్-3 ఎస్ఐ హరిబాబు, ఎస్ఐ నారాయణ తదితర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుర్వేద, యోగా అవగాహన శిబిరం

(నిజామాబాద్, ఇదీ సంగతి)



ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాశాల నిజామాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం జడ్పీహెచ్ఎస్ స్కూల్ బోర్గంలో విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత ఆయుర్వేద, యోగ అవగాహన శిబిరం నిర్వహించినట్లు జిల్లా ఆయుష్ ఇన్‌చార్జీ డాక్టర్ జె. గంగాదాస్ తెలిపారు. ఈ శిబిరంలో వర్షాకాలంలో వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దినచర్య, రుతు చర్య, సీజనల్ వ్యాధులు, యోగ ప్రాముఖ్యత గురుంచి వివరించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో యోగా విన్యాసాలు ప్రదర్శించి, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానం ప్రాధాన్యతలను వివరించారు. ఈ శిబిరంలో హెడ్ మాస్టర్ శంకర్, యోగ వైద్యుడు డాక్టర్ తిరుపతి, ఆయుష్ ఫార్మాసిస్ట్ పురుషోత్తం, యోగ శిక్షకులు నమ్రత, రాజేందర్, ఆయుష్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందూరు కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

(నిజామాబాద్, ఇదీ సంగతి)



నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా కోరారు. సీడీఎంఏ శ్రీదేవిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ప్రధానంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇందూరు అభివృద్ధి కోసం నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే కార్పొరేషన్‌కు రావాల్సిన జనరల్ ఫండ్, ఇతర పనులను మంజూరు చేయాలన్నారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

■ సంపుటి: 4 - సంచిక: 335 | 28 జులై 2026 | మంగళవారం | 4 పేజీలు ■




## ప్రాణాలు తీస్తున్న..

# సరదాలు..!

● నది పరివాహక ప్రాంతాల్లో పెరుగుతున్న రీల్స్ కల్చర్

● అప్రమత్తమైన పోలీసులు

● కఠిన ఆంక్షలు అమలు

ఒక్క రోజు సెలవొచ్చినా సరే సరదాగా వెళ్లి షికార్లు చేయడం ఆనవాయితీగా మారింది. ముఖ్యంగా యువతలో మరీ ఎక్కువైంది. ఇలాంటి సరదాలే ప్రాణాలు తీస్తున్నాయి. సెలవులు వచ్చాయంటే చాలు నలుగురు స్నేహితులు కలిసి షికార్లకు వెళ్లడం రివాజుగా మారింది. అందులోనూ నది పరివాహక ప్రాంతాలంటేనే యువత ఆసక్తిగా వెళుతున్నారు. నది ప్రవాహక ప్రాంతాల్లో రీల్స్ చేసే కల్చర్ మితి మీరుతోంది. ఆదివారం శ్రీరాంసాగర్ లక్ష్మికెనాల్ వద్ద నలుగురు యువకులు మృత్యువాత పడిన వైనం యంత్రాంగాన్ని కలవర పెట్టింది. ముఖ్యంగా పోలీసు శాఖ అప్రమత్తమైంది. రాబోయే రోజుల్లో ఇలాంటి విపత్తులను నివారించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తుంది. నది పరివాహక ప్రాంతాల్లో రీల్స్ చెయ్యకుండా కట్టడి చేసే పనిలో పడింది. ఆదివారం నలుగురు గల్లంతైన లక్ష్మి కెనాల్ ప్రాంతానికి వచ్చిన సీపీ సాయి చైతన్య ఇదే విషయంపై స్పష్టత ఇచ్చారు. ఎలాగో వర్షాకాల సీజన్ కావడంతో జిల్లాలో నిజాంసాగర్, శ్రీరాంసాగర్‌లతో ఇతర చిన్న తరహా ప్రాజెక్టుల వద్ద రీల్స్ చెయ్యకుండా పోలీస్ శాఖ కఠిన ఆంక్షలు అమల్లోకి తేబోతోంది. సోషియల్ మీడియాలో సందడి చేయాలనే ఆలోచనతో యువకులు ఎక్కువగా నది ప్రవాహక ప్రాంతాలనే ఎంపిక చేసుకుంటున్నారు. (మిగతా 2లో..)

(జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

## సమాజంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యం

(నిజామాబాద్, ఇదీ సంగతి)




సమాజంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పనిచేస్తోందని ఈగల్ ఫోర్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్.గిరిధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంస్థ, డ్రగ్స్ సరఫరాను ఛేదించడం, యువతలో అవగాహన కల్పించడం నిజామాబాద్ జిల్లా పరిధిలో గత ఏడాది 7000 మందికి అవగాహన చేసినట్టుగా తెలిపారు. అలాగే నేరస్థులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఈగల్ ఫోర్స్ సంస్థ కార్యకలాపాల్లో భాగంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తదితర కేంద్ర సంస్థలు, అలాగే తెలంగాణ పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా రాంపూర్, ఒడిశా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో వేలాది మంది యువతకు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, సంస్థ ప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరా వ్యవస్థపై సమాచారం సేకరించి సంబంధిత అధికారులకు అందిస్తూ, నేరస్థులను గుర్తించడంలో సహకరిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎన్‌సీసీ నిజామాబాద్ సాధించిన ముఖ్య విజయాలు కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. ఆల్ప్రాజోలామ్, గంజాయి తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన పలు కేసులను గుర్తించి, కేసులు నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.సే నాట్ టూ గ్రడ్స్ సే ఎస్ టూ లైఫ్ అనే నినాదంతో ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని ఈగల్ ఫోర్స్ పిలుపునిచ్చింది.

## పేకాట స్థావరంపై చీతా ఫోర్స్ దాడి

### - బీఆర్ఎస్ నేత సహా ఏడుగురు అరెస్ట్..



(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కండేయ గుడి వద్ద గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరంపై చీతా ఫోర్స్ మెరుపుదాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.42 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల అదుపులోకి వచ్చిన వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన న్యాల్‌కల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. పేకాట, నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఆయన పాత్రపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నగరంలో పేకాట స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం కొనసాగుతుంది.


జనం కోసం..
అక్షర సమరం

# ఇదీ సంగతి

28 జులై 2026 | మంగళవారం | హైదరాబాద్ | 4 పేజీలు

## విద్యుత్ అంతరాయాలకు చెక్..!

### - ఫిర్యాదు రాగానే స్పందన.. ప్రూనర్‌తో వెంటనే పరిష్కారం




(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను వేగంగా తొలగించి, విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు అందుబాటులోకి తీసుకొచ్చిన అత్యాధునిక ప్రూనర్ పరికరాలు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు ఇస్తున్నాయని చాదర్‌ఘాట్ ఏఈ ప్రసాద్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి ఈ ఆధునిక పరికరాలను అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రూనర్లతో చెట్ల కొమ్మలను తక్కువ సమయంలోనే సురక్షితంగా తొలగించడం సాధ్యమవుతోందని, దీంతో విద్యుత్ అంతరాయ సమయం గణనీయంగా తగ్గి, వినియోగదారులకు త్వరగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించగలుగుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం అందిన ఫిర్యాదును చాదర్‌ఘాట్ ఏఈ కార్యాలయం వెంటనే స్వీకరించి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆధునిక ప్రూనర్ సాయంతో చెట్ల కొమ్మలను తొలగించి సమస్యను త్వరితగతిన పరిష్కరించినట్లు తెలిపారు. దీంతో సాధారణ విద్యుత్ సరఫరాను అతి తక్కువ సమయంలోనే పునరుద్ధరించామని చెప్పారు.ఈ ఆధునిక పరికరాల వల్ల క్షేత్రస్థాయి సిబ్బంది పనిభారం తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతున్నామని, విద్యుత్ అంతరాయాల పరిష్కారంలో వేగం పెరిగిందని ఏఈ ప్రసాద్ వెల్లడించారు.



## ఇన్‌స్టాగ్రామ్ క్లూతో..

# మైనర్ల ఆచూకీ సుఖాంతం

### - మధ్యప్రదేశ్‌లో రైలులో గుర్తించి.. తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

ఇంట్లో తల్లిదండ్రులు తరచూ మందలించడంతో మనస్తాపాని కి గురైన ముగ్గురు మైనర్ బాలికలు ఇళ్ల నుంచి వెళ్లిపోయిన ఘటనలో మైలార్‌దేవపల్లి పోలీసులు చాకచక్యంగా వ్యవహ రించి 24 గంటల్లోనే వారిని సురక్షితంగా గుర్తించి తల్లి దండ్రులకు అప్పగించారు. సాంకేతిక నిఘా, రైల్వే పోలీసుల సమన్వయంతో మధ్యప్రదేశ్‌లోని బీనా రైల్వే స్టేషన్‌లో దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న బాలికలను గుర్తించి రక్షించారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 24న కాటేదాన్ నుంచి బుద్వేల్ రైల్వే స్టేషన్‌కు ఆటోలో చేరుకున్న ముగ్గురు బాలికలు అక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఢిల్లీ వెళ్లే దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కారు. జూలై 25న బాలికల్లో ఒకరి తల్లి మైలార్ దేవపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రాజేంద్రనగర్ జోన్ డీసీపీ పర్యవేక్షణలో పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ దృశ్యాలను పరిశీలించడంతో పాటు బాలికల్లో ఒకరు రహస్యంగా తీసుకెళ్లిన మొబైల్ ఫోన్ ద్వారా వినియోగిస్తున్న ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను గుర్తించారు. ఆ ఖాతాకు అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను సాంకేతికం గా ట్రేస్ చేసి, వారు దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నట్లు నిర్ధారించారు. అనంతరం రైలు కోచ్, సీటు వివరాలను గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మధ్యప్రదేశ్‌లోని బీనా రైల్వే స్టేషన్‌లో రైలును నిలిపి వేసి ముగ్గురు బాలికలను క్షేమంగా రక్షించారు. అనంతరం వారిని హైదరాబాద్‌కు తీసుకువచ్చి చట్టపరమైన ప్రక్రియలు, కౌన్సె లింగ్ పూర్తి చేసిన తర్వాత వారి తల్లిదండ్రులకు అప్ప గించారు. ఈ సందర్భంగా పిల్లలతో తల్లిదండ్రులు నిరంతరం మాటాడాలని, వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని పోలీసులు సూచించారు. అలాగే పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై పర్యవేక్షణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన పెద్దలను ఆశ్రయించేలా వారికి అవగాహన కల్పించాలని కోరారు.

## తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్ ఏర్పాటు హర్షణీయం

(హైదరాబాద్, ఇదీ సంగతి)



రాష్ట్రంలో పౌరులకు, ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన, అవినీతి రహిత సేవలు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రెవెన్యూ శాఖ ద్వారా జారీ చేసిన జీవో నం. 172 ప్రకారం 'తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్' ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయ మని టీఎన్‌జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుటుంబ సభ్యుల వివరాలన్నీ ఒకే ధ్రువీకృత రికార్డులో అందుబాటులోకి రావడం వల్ల ప్రభుత్వ సేవలు పొందడంలో పారదర్శకత పెరుగుతుందని, కాలయాపన తప్పుతుందని హుస్సైనీ ముజీబ్ అభిప్రాయ పడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు వివిధ శాఖల్లో తమ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, వారసత్వ సంబంధిత వివరాలు, ఇతర అధికారిక ప్రయోజ నాల కోసం పదే పదే సర్టిఫికెట్లు సమర్పించే బాధ తప్పి, ఒకే ధ్రువీకృత పత్రాన్ని వినియో గించు కునే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. కేవలం ఉద్యోగులకే కాకుండా సాధారణ ప్రజానీకానికి కూడా ఈ విధానం ఎంతో ఊరట నిస్తుందని ఆయన పేర్కొన్నారు. పలు రకాల ప్రభుత్వ పథకాలు, సేవల కోసం వివిధ ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం తగ్గిపోతుందని, 'మీ-సేవ' కేంద్రాల ద్వారా ఎంతో సులభంగా, త్వరితగతిన 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్' పొందే వెసులుబాటు కలుగుతుందని వివరించారు. ప్రజల కష్టాలను దూరం చేసేలా ఈ ప్రజాహిత నిర్ణయం తీసుకున్న రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రితో పాటు టీఎన్‌జీఓస్ సెంట్రల్ యూనియన్ తరఫున ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

(హైదరాబాద్, ఇదీ సంగతి)

హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో టీ.ఎన్.జి.ఓస్ యూనియన్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ యూనిట్ అధ్యక్షులు కేసరి హనుమాన్, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, చీఫ్ లైబ్రేరియన్ పీ.జి.వి.రాణి ఆధ్వర్యంలో బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీ.ఎన్.జి.ఓస్ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ ముఖ్య అతిథిగా హాజరై బంగారు మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఉద్యోగులంతా ఐక్యంగా నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీ.ఎన్.జి.ఓస్ యూనియన్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ యూనిట్ అధ్యక్షులు కేసరి హనుమాన్, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, చీఫ్ లైబ్రేరియన్ పి.జి. వి.రాణిలు ముఖ్య అతిథి డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ అన్నను శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం



లో టీ.ఎన్.జి.ఓస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు బొలిగిద్ద శంకర్, ప్రచార కార్యదర్శి వైదిక్ శాస్త్ర, ఈసీ సభ్యులు ముకీద్, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ యూనిట్ ఉపాధ్యక్షురాలు సి. అపర్ణ (గెజిటెడ్ లైబ్రేరియన్), సంయుక్త కార్యదర్శి రాకేష్, సంయుక్త కార్యదర్శి ఎం. శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే రమ్య, అనిత, రవి, ఉమా మహేశ్వర్ రెడ్డి, విక్రమ్, మహేష్, దీక్షిత్, నరేందర్, అబ్దుల్ అతర్తో పాటు స్టేట్ సెంట్రల్ లైబ్రరీ సిబ్బంది, ఉద్యోగులు, రంగారెడ్డి జిల్లా జీజీఎస్, సీజీఎస్ ప్రతినిధులు, పలువురు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని బంగారు మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఇదీ సంగతి
జనం కోసం..
అక్షర సమరం

# బీజేపీ పార్టీకి దేశం ముఖ్యం, పదవి కాదు... అందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

(నిజామాబాద్ ఇదీసంగతి)

దేశం ముందు, ఆ తర్వాతే పార్టీ, ఆఖరికే కార్యకర్తలు అనేది భారతీయ జనతా పార్టీ సిద్ధాంతమని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశం లో దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ... కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంలో ఆయన తప్పు ఏమీ లేకపోయినా, నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రయోజనాల కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయన రాజీనామాతో ప్రధాని మోడీ ఓడిపోయారని కొంత మంది దేశ వ్యతిరేక శక్తులు రాక్షసానందం పొందుతున్నాయి. పాఠ్యాంశాల నుండి అక్బర్, బీర్బల్ , మొఘలుల చరిత్రను తొలగించి, ఈ దేశపు గొప్ప మహనీయుల చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చినందుకు ప్రధాని నరేంద్ర మోడీ ,




ధర్మేంద్ర ప్రధాన్‌పై కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తమ అక్కసును వెళ్లగక్కుతున్నారు. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక చొరవ తీసుకుని, విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం కోల్పోకుండా వెంటనే తిరిగి పరీక్షలు నిర్వహించేలా ఆదేశించి నిజమైన సత్తా ఉన్న విద్యార్థులకు న్యాయం చేశారు. ఇది మన ప్రధాని నైతికతకు నిదర్శనం అన్నారు. ఇటీవల విద్యార్థుల పేరుతో ధర్నాలు చేసిన వారు విదేశీ శక్తుల ధనబలంతో, వారి ప్రేరేపణతోనే ఈ ఆందోళనలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాండిల్ ర్యాలీలు తీయడం విడ్డూరంగా ఉంది. రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యారులకు స్కాలర్షిప్ లు ఇవ్వనందుకు సిగ్గుపడి ఈ క్యాండిల్ ర్యాలీ తీశారా? 21 సంవత్సరాలకే యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలంటున్న సీఎం రేవంత్.. తన మంత్రివర్గంలో ఎంతమంది అవకాశం ఇచ్చారో చెప్పాలి. దేశం 'వికసిత్ భారత్' దిశగా అడుగులేస్తున్న తరుణంలో దేశ వ్యతిరేక శక్తులు, కమ్యూనిస్టు భావజాలం ఉన్నవారు ఇటువంటి ఆందోళనల ద్వారా దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారు. ఈ సమావేశంలో పోతన్ కార్ లక్ష్మీనారాయణ, ప్రమోద్ కుమార్, జ్యోతి, శివ ప్రసాద్, ఓం సింగ్, కిషోర్, రాము, కల్పే అర్చనా, పిల్లి శ్రీకాంత్, విజయ్, పురుషోతం , అన్నం గోపి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొలువుతీరిన చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గం

(నిజామాబాద్ ఇదీసంగతి)



నిజామాబాద్ చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఇటీవల సంఘానికి ఎన్నికలు జరగగా సోమవారం పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది..సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికైన గుజ్జ రాజేశ్వరి పూజా కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు..సంఘం మాజీ అధ్యక్షుడు గుద్దేటి రామకృష్ణ నూతన అధ్యక్షురాలు రాజేశ్వరికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు.చేనేత రంగానికి పూర్వ వైభవం తెచ్చేలా పాటుపడతానన్నారు. చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి పెంటి రాజు,కోశాధికారి నందాల నరేష్,డైరెక్టర్లు దిండిగల్ల శంకర్,కైరంకొండ బాల్ రాజ్,కారంపూరి ప్రభు,గాలిపల్లి అరుణలు కూడా ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించారు. చేనేత సంఘం ఎన్నికల అధికారి పోశన్న, పద్మశాలి హాస్టల్ అధ్యక్షుడు దీకొండ యాదగిరి,జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బిజ్జ దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు,గౌరవ సలహాదారులు రాపెల్లి గురుచరణ్,నగర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కన్న దుబ్బ రాజం, ప్రధాన కార్యదర్శి చౌటి భూమేశ్వర్,నగర సంఘం మాజీ అధ్యక్షులు ఎస్సార్ సత్యపాల్,చేనేత సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సబ్బని ప్రసాద్,జిల్లా సంఘం ప్రతినిధులు లక్కవత్రి దేవీదాస్,బింగి ధర్మవీర్,చింతల గంగాదాస్,గుజ్జ బాలమల్లు, తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ సీఐకి వీడీసీ సభ్యుల సన్మానం



(నిజామాబాద్ ఇదీసంగతి)

నిజామాబాద్ రూరల్ మండలంలోని నగరపాలక సంస్థ పరిధి ఒకటవ డివిజన్ ఖానాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ( వీ డీ సీ) ఇటీవల నూతనంగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో వీ డీ సీ చైర్మన్ జగన్ యాదవ్, వైస్ చైర్మన్ సాలుగారి మోహన్, క్యాషియర్ సంపత్, ప్రధాన కార్యదర్శి బెంజీ ల ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీఐ ని శాలువాతో సత్కరించారు. గ్రామంలో ఎల్లప్పుడూ శాంతిభద్రతలకు ప్రజలు సహకరించేలా వీడీసీ సభ్యులు చొరవ చూపాలని సీఐ సూచించారు. ముఖ్యంగా యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూడడంతో పాటు గ్రామ అభివృద్ధిలో వారు భాగస్వాములయ్యేలా చూడాల్సిన బాధ్యతను వీడీసీ సభ్యులు గుర్తెరుగాలన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చొరవ చూపుతూ గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన వీడీసీ సభ్యులకు సూచించారు. సీఐ ని కలిసిన వారిలో వీడీసీ సలహాదారులు కోర్వా గంగా నరసయ్య, సాయికుమార్, దేవన్నా, సురేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

## పెండ్లి చేసుకుంటానని సర్పంచ్ మోసం చేసాడు

### - ఆందోళనకు దిగిన యువతి

(నిజామాబాద్ ఇదీసంగతి)

పోతంగల్ మండలం జన్నపల్లి గ్రామ సర్పంచ్ దస్తగిరి తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని యువతి బోధన్ ఆర్డీవో ఆఫీస్ ఎదుట బైఠాయించింది. తనను వివాహం చేసుకుంటానని చెప్పి అన్యాయం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది . ఆరేళ్లుగా తాము ప్రేమించుకున్నామని.. రెండుసార్లు తనకు అబార్షన్ సైతం చేయించాడని ఆమె ఆరోపించింది. పెళ్లి చేసుకుందామని అడిగితే తప్పించుకు తిరుగుతున్నాడని.. అతడితో తనకు పెళ్లి జరిపించాలని ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసింది.

## ఆగస్టు 15లోపు "జలసిరి" పనులను పూర్తి చేయాలి

(నిజామాబాద్ ఇదీసంగతి)



ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు వీలుగా గ్రామగ్రామాన జలసిరి కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి అనంతరం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. ఈ నెల 28న అన్ని మండలాలలో మండల స్థాయి సభలు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. అదేవిధంగా 29, 30 తేదీలలో గ్రామ పంచాయతీల స్థాయిలో గ్రామ సభలు జరపాలని అన్నారు. ఈ సభలలో ఎల్ నినో ప్రభావం గురించి, జల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా వీబీజీ రామ్-జీ పథకం కింద విరివిగా ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి జాబ్ కార్డు కలిగిన కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని అన్నారు. వాటర్ షెడ్ నిర్మాణాల ద్వారా నీటి సంరక్షణ జరగడంతో పాటు కూలీలకు ఉపాధి కల్పించి పని దినాల లక్ష్యాన్ని సాధించవచ్చని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి రోజు సగటున 60 మందికి పని కల్పించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. భూగర్భ జలాల పెంపునకు దోహదపడే జలసిరి కార్యక్రమాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా వీ.ఓ భవన నిర్మాణ పనులను కూడా నవంబర్ 15 లోపు పూర్తి చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా సమావేశం



(నిజామాబాద్ ఇదీసంగతి)

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా సమావేశాన్ని నేడు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎంఎస్పీ జిల్లా నాయకులు సరికేల పోశెట్టి మాదిగ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ సమావేశానికి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశం మేరకు నిజామాబాద్ జిల్లాకు ఇంచార్జిగా, ముఖ్య అతిథిగా మాసాయిపేట యాదగిరి మాదిగ హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాసాయిపేట యాదగిరి మాదిగ మాట్లాడుతూ " మాదిగ జాతి త్యాగానికి రూపమని, బలానికి రూపానికి వివరించడం జరిగింది. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ లాంటి నాయకుడు బలంగా మన జాతికి అండగా ఉండడం జరిగింది. నూతన జిల్లా కమిటీలో పని చేసే వాళ్లకే అవకాశం కల్పిస్తామని తెలియచేయడం జరిగింది. కాబట్టి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ, మండల కమిటీలను బలంగా వేసుకోవాలని విజ్ఞప్తి చెయ్యడ జరిగింది. నిజామాబాద్ జిల్లాలో ఎమ్మార్పీఎస్, ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా తయారు చెయ్యాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొనడం జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఇంచార్జి సరికేల పోశెట్టి మాదిగ, బాల్కొండ ఇంచార్జి :కనక ప్రమోద్ మాదిగ , ఆర్మూర్ ఇంచార్జి :మైలారం బాలు మాదిగ , నిజామాబాద్ రూరల్ ఇంచార్జి :గంధమల్ల నాగభూషణం మాదిగ , బోధన్ ఇంచార్జి :ఆకారం రమేష్, లసింగారి భూమయ్య, పొచ్చిరాం మాదిగ పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గంప శశాంక్

(నిజామాబాద్ ఇదీసంగతి)



తన జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు గంప శశాంక్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్)ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆశీస్సులు, శుభాకాంక్షలు అందుకున్న గంప శశాంక్, పార్టీ బలోపేతానికి యువత మరింత చురుకుగా పనిచేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా నిలవాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేస్తానని గంప శశాంక్ పేర్కొన్నారు.

# ప్రాణాలు తీస్తున్న సరదాలు...!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా శ్రీరాంసాగర్‌లో పూర్తి స్థాయి నీటి మట్టం లేక పోవడంతో బ్యాక్ వాటర్ ఉండే ప్రాంతాలు మైదానంగా మారాయి. అదే రీల్స్ చేసేవారికి టూరిస్ట్ స్పాట్‌గా మారింది. చాలామంది సోషియల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే యువత ఇదో గోవా అంటూ బ్యాక్ వాటర్ ఏరియాలో రీల్స్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. అవి చూస్తున్న వారు సైతం అక్కడికి వెళ్లి సెల్ఫీలు దిగుతున్నారు. కొందరు ఏకంగా బ్యాక్ వాటర్ వైపు ఎలా వెళ్లాలో కూడా రూట్ మ్యాప్‌తో సహా వీడియోలు పోస్టు చేస్తున్నారు. ఇదే తరహాలో రీల్స్ చూసి నగరానికి చెందిన ముగ్గురు మెకానిక్‌లు మహారాష్ట్ర నుంచి వచ్చిన తమ బంధువుతో కలిసి బ్యాక్ వాటర్ వైపు ఉండే లక్ష్మి కెనాల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద మడుగులోకి దిగారు. మొదట ఒక్కరే దిగి చిక్కుకుపోయినా మిగితా ముగ్గురు రక్షించే క్రమంలో ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఆయా ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేదు. ప్రతియేటా వర్షాకాల సీజన్‌లో ఆయా ప్రాజెక్ట్‌లకు సందర్శకులు పోటెత్తుతారు. కాబట్టి యంత్రాంగం రాబోయే రోజుల్లో ఎలాంటి విపత్తులు తలెత్తకుండా కట్టడి చేయాల్సి ఉంది.